ఎర్ర సత్తెం యింటిముందు ఆఖరి గుమ్మానికి అరడుగు దూరంలో సీనయ్య కుదేలయిపోయి కూర్చున్నాడు. ఎర్రసత్తెం సింహాసనం లాంటి పేముకుర్చీలో కుబేరుడిలా కూర్చుని వున్నాడు.

రైల్వే స్టేషన్స్‌లో ఫస్టు క్లాసు వెయిటింగు రూముల్లో కనిపించే మోస్తరు కుర్చీ అది. అంత లావున్న ఎర్ర సత్తెం ఆ కుర్చీలో ఓ పక్కకి రాలేదు.

కాకి నిక్కరుని మోకాలు మడతలోకి తోసుకుని. మోకాలి చిప్పల మీద రెండు చేతులు వేలాడదీసుకుని, నేలమీద గొంతుక్కూర్చున్న సీనయ్య ఆలోచిస్తున్నాడు.

సీనయ్య కడుపులో ఆకలి మంట! ఎర్రసత్తెం కడుపులో అజీర్తి మంట! మాటిమాటికి త్రేపుమని తేన్చుకుంటూ కంఠం మండుతూంటె. ముఖం వికారంగా మార్చుకుని. ఎర్రసత్తెం మాట్లాడుతున్నాడు.

సీనయ్య యిబ్బందిగ వింటున్నాడు.

చిరాగ్గా ఎర్రసత్తెం అన్నాడు.

"ఏడీ? అచ్చయ్య ఏడీ?"

"టేసెనుకి బేర వొస్తే రిచ్చాయేసుకుని ఎల్లాడండి!

ఎర్ర సత్తెంకి ఆరు రిక్షాలున్నాయి. ఏడు ఇళ్ళు వున్నాయి. ఎనమండుగురు భార్యలున్నారు. తొమ్మిది లక్షలున్నాయి పదిమందిలో గౌరవం, పేరు ప్రతిష్ఠలు వున్నాయి! అంతకుమించి అతని పలుకుబడి హైదరాబాదు వరకూ వ్యాపించింది.

సీనయ్యకి తినడానికి వెనక్కాల పది నోళ్ళు వున్నాయి. వుండడానికి తొమ్మిది చదరపు గజాల గుడిసె వుంది. తీర్చడానికి ఎనిమిదివందల అప్పు వుంది. ఏడవడానికి కావలసినంత స్వేచ్ఛ వుంది. అరువయినా పుట్టని మంచితనం వుంది! అంతకుమించి ఆంధ్ర దేశమంత ఆకలి. భారద్దేశమంత దరిద్రమూ వున్నాయి!

ఎర్రసత్తెం సెలవిచ్చిన విషయం విన్నాక కుప్పలా కూలిన సీనయ్య స్థితి పాము నోట పడ్డ కప్ప లాగా వుంది! ఆ కప్పనయితే ఆపాము వదిలే ప్రసక్తి లేదు! కాని- ఈ కప్పను యీ పాము వదుల్తోంది! వదలగలదు కూడా! అయితే సీనయ్యకప్ప చెయ్యాల్సిందల్లా ఎర్ర సత్తెంపాము చెప్పిన దానికి ఒప్పుకోడమే! అలా ఒప్పుకునేందుకే సీనయ్య వెనుకాడుతున్నాడు.

రిక్షాకి రోజుకి రెండు రూపాయలు అద్దె కట్టేవాడు సీనయ్య. తర్వాత మూడయింది. ఇప్పుడు ఒక్కమాటుగ అయిదు రూపాయలు చేసేసరికి. సీనయ్య మెలికెలు తిరుగుతున్నాడు.

'ఇంతాచేసి పెంచమంటున్నది ఎంత? రెండు రూపాయ ! మూడున్నర దగ్గర మొదలుపెట్టి నాలుగుదాకా తనే వచ్చాడు. ఇంకెంత? మరొక్క రూపాయి! రూపాయి కోసం సీనయ్యకాపేచీ ఎందుకు? రూపాయికున్న విలువ ఎంత? రెండు కవర్లు రాస్తే సరి; రెండు మొక్కజొన్న పొత్తులు రావు! ఓ మామిడిపండు రాదు! ఆఖరికి ఓ సినిమా టిక్కెట్టు కూడా రాదు!'



# భాగోతం

మహీధర రామశాస్త్రి

# సుభాషితాలు

ప్రతి ఒక్కడూ ఈ ప్రపంచం మారిపోవాలని అనుకుంటాడే తప్ప తాను మారాలని ఎన్నడూ ఆలోచించడు. —టాల్‌స్టాయ్

* * *

పవిత్రమైనజిజ్ఞాసను ఎన్నడూ వదిలిపెట్టకు.

—ఐన్‌స్టీన్

* * *

సుఖాన్ని కోరేవాడు విద్యను వదులుకోవాలి. విద్యను కోరేవాడు సుఖాన్ని వదులుకోవాలి. సుఖం కావాలనుకునేవాడికి విద్యా .... విద్య కావాలనుకునే వాడికి సుఖమూ దొరకదు. —జిడ్డు కృష్ణమూర్తి

* * *

మనం బాధలో ఇంకొకరికి ఆనందాన్ని కల్పించామనే జ్ఞానంకన్న గొప్ప ఆనందం లోకంలోలేదు. —చలం

* * *

మనిషిని మరొకడు ఉద్ధరించలేడు. వేరొకడు తరింపజేయ జాలడు. తనను తానే ఉద్ధరించుకోవాలి. స్వయంగా తరించాలి. నిజానికి మానవుని ఔన్నత్యం యిందులోనే వుంది.

—జిడ్డు కృష్ణమూర్తి

* * *

మహిళ మీద, దైవం మీద నమ్మకం లేక పోవడం మానవాత్మకు అత్యంత విచారకరమైన విషయం.

—అలెగ్జాండర్ స్మిత్

* * *

బహుగ్రంథ పఠనం కన్న పరిశీలన, పలువురి పరిచయాలకన్న అనుభవం మనిషికి ఎక్కువగా జ్ఞానాన్ని కలుగజేస్తాయి.

—ఎ. బి. ఆర్కాట్

* * *

విద్యా వృక్షం వేరు చేదయినప్పటికీ— ఫలం మాత్రం మధురమైనది.

—అరిస్టాటిల్

* * *

ఒకవేళ మనం ఓడిపోవడానికి అవకాశం ఉన్నంత మాత్రాన మనం నమ్మిన ఆదర్శాలను ఆచరించడానికి వెనుదీయకూడదు.

—బుల్వర్

సేకరణ: షాజాద్ బేగం

ఎర్ర సత్తేనికి తల్చుకుంటున్న కొద్దీ ఒళ్లు మండిపోతూంది. ఎర్ర సత్తెం ఇంకా ఇలా అనుకున్నాడు :

'ఆఖరికి ఆ బ్యాంకు మేనేజరు కూడా తను అడ్డం వుంటే తప్ప సీనయ్య, లచ్చయ్యలకి రుణం ఇవ్వడానికి ఒప్పుకోలేదాయె. తనెంత కష్టపడ్డాడు రుణం ఇప్పించడానికి! ఎంతెంత లంచాలు ఇవ్వాల్సి వచ్చింది! తను కోరిందల్లా రిక్షాలు తన ముంగిట్లో వుండాలన్నాడు! అద్దె చెల్లిస్తూ బాకీ తీర్చమన్నాడు! ఆ తర్వాత రిక్షాలు ఎవరివి వారు పట్టుకుపోవచ్చన్నాడు! అవును మరి, ఆ మాత్రం కట్టుదిట్టం చేయకపోతే సీనయ్య తాగేసి రిక్షాని నాలుగు వేలుపెన క్కాయలకి అమ్మిపారేస్తే తన మాటేవిటి? బ్యాంకు మాటేవిటి? తనూ, బ్యాంకాయన వాళ్ళ క్షేమం కోరే కదా ఈ సహాయం అందిస్తూంట!'

ఆ మాటలే ఎర్రసత్తెం పైకి వికార ముఖం పెట్టుకూర్చున్న సీనయ్యకి వినిపించేడు తేన్చుకుంటూ.

సీనయ్య "బతకలేం బాబూ!" అంటూ మొర పెట్టుకుంటున్నాడు.

అంతలో లచ్చయ్య, మిగతా నలుగురూ రిక్షాలు తీసుకుని వచ్చేరు. రిక్షాలను పందిరి కింద వరసగా పెట్టేసి, సీనయ్య సరసన వచ్చి కూర్చున్నారు వరసగా!

దర్బారులోని పాదుషాలా గొంతు సవరించుకుని, రేపటి నుంచి వాళ్ళంతా రోజుకి అయిదేసి రూపాయలు అద్దెకింద జమ కట్టాలని చెప్పేడు ఎర్రసత్తెం.

ఆరుగురూ గోల చెయ్యడం ప్రారంభించేరు. పేపు కుర్చీకున్న నల్లి కూడా జంకలేదు వాళ్ళ గోలకి. తాపీగా ఎర్ర సత్తెం అడిగేడు.

"ఏవిటంటారు మీరింతకీ?"

"రిచ్చాల్లాగడం మానేస్తంగాని అయిదు రూపాయలు అద్దె కట్లేవండి!" లచ్చయ్య ఖచ్చితంగా చెప్పేసేడు.

ఎర్ర సత్తెంకి మండింది. లచ్చయ్యమీద విరుచుకుపడ్డాడు.

"మానెయ్యిరా! లచ్చిగా! నువ్వు రిక్షా లాగకపోతే లోకం ఆగిపోదు! మొగలో కెళ్ళి తొక్కుకుందుకు రిక్షా వుందనగానే అరడజను మంది గ్రాడ్యుయేట్లు వస్తారు!"

అనేసి ఎర్ర సత్తెం కోపంగా లేచి తిరిగి చూడకుండా లోపలకు వెళ్ళిపోయేడు. కంగారుగ, విసురుగా లేవడంతో ఎర్ర సత్తెం గ్లాస్కో పంచె తెల్లగోచీ వూడిపోయి, నేలమీద పడి యీడ్చుకుంటూ ఎర్ర సత్తెం వెనక్కాలే వెళ్ళిపోయింది తోకలా!

రిక్షా వాళ్ళు మౌనంగ యింటి ముఖాలు పట్టేరు.

* * *

"రిక్షా కార్మికుల సమ్మె—వర్ధిల్లాలి!"
"కార్మిక విజయం — జిందాబాద్!"
"రిక్షావాళ్ళ-నశించాలి!"
"దళారి వర్గం-నశించాలి!"
జోరుగా సాగుతూంది వూరేగింపు.

నగరంలోని రిక్షాలన్ని నడవడం మానేశాయి. అసలే పిటపిటలాడుతూ తిరిగే సిటీ బస్సులు యీ సమ్మె మూలంగా మరింత వోవర్ లోడయి, టైర్లని బద్దలుకొట్టుకుంటూ రోడ్డువార ఒరిగిపోతున్నాయి! జనం—పాపం— నానా ఇబ్బంది పడిపోతున్నారు సినిమా హాళ్ళకి పరుగులు పెట్టలేక!

రిక్షా వోనర్ల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి! ఈ సమ్మె ఎటు నుంచి ఎటు తిరుగుతుందో తెలియడంలేదు!

రిక్షా వోనర్లలో నగం మంది వార్డు మెంబర్లే కాబట్టి, ఎర్రసత్తెం లాంటి వాళ్ళే కాబట్టి సీరియేనుకి రింగు కొట్టి పరిస్థితిని తెలియజేసేరు. సమ్మె విఫలం అయి తను మాట నిలబడకపోతే ఎంత నష్టమో, కష్టమో వివరించి చెప్పేసేరు.

సీరియేను శాంతియుతంగా సమ్మె సమాప్తం చేయించి పూచీని తనమీద వేసుకున్నాడు.

సీరియేను బామ్మర్ది భాగోతంరావు స్థానిక ఎమ్మెల్యే! భాగోతంరావు గొప్ప దైవ భక్తుడూ, ప్రజాసేవా సక్తుడూనూ! ప్రతీ అయిదేళ్ళకి ఒకసారి తప్పనిసరిగా తిరపతి వెళ్ళి లక్షరూపాయలు హుండీలో పడేసి, గుండుకొట్టించు కొచ్చేస్తాడు. వస్తూ రెండు టోపీలు కొంటాడు! ఒకటి తనకి! రెండోది తన ప్రజలకి! ఓ కాకి కబురందుకుని హైదరాబాదునుంచి ఆదరాబాదరా వచ్చి నగరంలో మీటింగు పెట్టేసేడు.

రిక్షా వాళ్ళందరూ జైకొట్టి తమ యిబ్బందుల్ని ఏకరువు పెట్టుకున్నారు.

తమకి న్యాయం జరక్కపోతే- 'యింతే సంగతులు' అని నగరంలో అడుగు పెట్టిన వెంటనే చెప్పేసేరు ఎర్రసత్తేలు!

ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తే తనకి రాజకీయ విజయమో ఆలోచించుకుంటున్నాడు భాగోతంరావు!

రిక్షావాళ్ళ సమస్యని తాపీగా విని భాగోతంరావు ప్రశ్నించేడు.

"ఈమాత్రం దానికి సమ్మెందుకు?"

రిక్షావాళ్ళందరూ తెల్లముఖాలు వేసేరు.

"కంగారు పడకండి! సమ్మె చెయ్యడం చెడ్డ పని అనడంలేదు! మంచిదే! ఒకవిధంగా ప్రజల దృష్టిలోకి మన సమస్య వెళ్ళింది!

కాని—"వోనర్లు నశించాలి! వాళ్ల నశించాలి! వీళ్ల నశించాలి!" అనడం. దౌర్జన్యానికి దిగడం మంచిది కాదంటున్నా! మీ బాధంతా అద్దె పెరిగితే మీకు గిట్టదనే గదా! మీకు మిగిలే ఆ పది రూపాయలు రోజుకి మిగిల్తే మీకు చాలుగదా? రిక్షా రేట్లు పెంచండి! పెట్రోలు ధర పెరిగితే టేక్సీవాళ్ళూ, ఆటోవాళ్ళూ రేట్లు పెంచడం లేదూ? అద్దె పెరిగిందని రిక్షాలు తొక్కడం మానేస్తే మీ డొక్కలే మాడతాయి!"

"బేరాలు తగ్గిపోతాయండి!" ఎవరో అన్నారు.

భాగోతంరావు చిరునవ్వు నవ్వి చెప్పేడు. రహస్యం చెబుతున్నట్టు.

"అదే మీ తెలివితక్కువ! ఏవీ తగ్గవు! జనం నాడి మీకు తెలియదు! ఏం తగ్గుతున్నాయి? టిక్కెట్టు రేటు పెరిగిందని సినిమాలు మానుతున్నారా? టిఫిన్ రేట్లు పెరిగాయని హోటళ్ళ కెళ్ళడం మానుతున్నారా? టేక్సీలు, ఆటోలు మూలపడ్డాయా? సిగరెట్లు మానుతున్నారా? పోస్టలు రేట్లు పెరిగాయని ఉత్తరాలు రాయడం మానుతున్నారా? రైలు ఛార్జిలు పెరిగాయని రైళ్ళలో రద్దీ తగ్గిందా? ఎవరూ ఏదీ మానరు! మానలేరు! సంపాదించుకునే మార్గాలు వెతుక్కోవాలిగాని. ఖర్చులు తగ్గించుకుంటామా?!"

కంఠం పెద్దది చేసుకుని. ఉపన్యాస ధోరణిలో యింకా యిలా కొనసాగించాడు.

"అదీ సంగతి! కాబట్టి మామూలుగా రిక్షాలు తొక్కండి! ప్రజలను యిబ్బంది పెట్టకండి! ఇంతవరకూ స్టేషనునుంచి బస్సు స్టాండుకి నాలుగుచ్చుకుంటే యిప్పుడు అయిదుచ్చుకుని ఆ రూపాయి అద్దెలో కట్టండి! అలా చెయ్యండి!" అని ముగించేడు భాగోతంరావు.

భాగోతంరావు భాగోతం పూర్తిగా అర్థం అయింది జనానికి.

తమ బతుకులు ఎదుగూ బొదుగూ లేక తమకి ఆ పదిరూకలే గతి అని. రిక్షావోనర్లు మాత్రం పేప కుర్చీల్లో కూర్చుని తేన్చుకుంటూ అంతస్తులు పెంచుకుంటారన్న పరమ రహస్యం భాగోతంరావుకి తెలుసున్నట్లే. కొద్దిమంది లచ్చయ్య సీనయ్యలు కూడా గ్రహించేరు.

సమ్మెను కొనసాగించేరు.

ఎర్ర సత్తేలు లొంగలేదు.

రిక్షా కార్మికులంతా తాత్కాలికంగా ఇతరత్రా కూలిపనులు చూసుకుని రోజుకి సరిపడే డబ్బులు సంపాదించేరు. రిక్షాలు తొక్కడానికి ముందుకు రాలేదు; కొత్తగా ఎవరినీ రానీయలేదు!

రెండు వారాలు గడిచేసరికి ఎర్రసత్తేల్లాంటి వాళ్ళకి భయం పట్టుకుంది! వచ్చే అద్దె రావడం లేదు! రిక్షాలు తుప్పుపట్టకుండా తుడుచుకోవడం సరిపోతూంది! పనిలో లేక రిక్షాలు మూలపడ్డాయి. పట్టు కదలించక తప్పలేదు!

మామూలు రేట్లకి తొక్కుకోమని కబుర్లు వెళ్ళేయి! సీనయ్యా. లచ్చయ్యా రిక్షాలు తొక్కడం ఆరంభించేరు. కాని. తర్వాత వచ్చిన ఎలక్షన్లలో మాత్రం— పాపం— భాగోతంరావుకి డిపాజిట్టు కూడా దక్కలేదు!



